

ఉత్సాహంగా

ఫుట్‌బాల్ టాలెంట్‌హంట్

మెదక్ స్టేడియంలో ఎంపిక పోటీలు

జిల్లావ్యాప్తంగా 300 క్రీడాకారులు హాజరు

మెదక్ అర్బన్, అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): టాలెంట్ ఒకరి సొత్తు కాదు.. ప్రతిభను నిరూపించునేందుకు అవకాశాలు రావాలి.. వేదికలు కావాలి.. అంతకుమించి మంచి ప్రోత్సాహం ఉండాలి.. గ్రామీణ స్థాయిలో విశేష ప్రతిభ ఉన్న క్రీడాకారులు ఎందరో ఉన్నారు. వారందిరినీ ప్రోత్సహించేందుకు యువ క్రీడాకారులను వెలికి తీసేందుకు ఇండియా ఖేలో ఫుటాబాల్ అసోసియేషన్(ఐకేఎఫ్) ముందుకువచ్చింది. మెదక్ అవుట్‌డోర్ స్టేడియంలో 11-17 సంత్సరాల లోపు బాల బాలికలకు శనివారం నిర్వహించిన టాలెంట్ హంట్‌ను పోటీలు ఉత్సాహంగా సాగాయి. జిల్లా నలుమూలల నుంచి 300 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఈ పోటీలను డీవైఎస్‌వో దామోదర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐకేఎఫ్ నిర్వాహకులు, సౌత్ ప్లాన్ ఫుట్‌బాల్ క్లబ్ అధ్యక్షుడు విష్ణుతేజ మాట్లాడుతూ ప్రతిభావంతులైన యువకులకు శిక్షణ ఇప్పించడంతోపాటు చిన్న వయసు నుంచే ప్రపంచస్థాయి ఆటగాళ్లగా తీర్చిదిద్దడమే టాలెంట్ హంట్ ప్రధాన ఉద్దేశమన్నారు. అత్యంత ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను గుర్తించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా ప్రోత్సహించేందుకు శాస్త్రీయ పద్ధతిలో ఆధునికి శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. ఇందుకోసం 35 మంది క్రీడాకారులు ఎంపికైనట్లు ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి నాగరాజు, క్రీడాకారులు పాల్గొన్నారు.

మెదక్ అవుట్‌డోర్ స్టేడియంలో ఫుట్‌బాల్ ఆడుతున్న క్రీడాకారులు



టపాసుల దుకాణాలు

జర భద్రం

అగ్నిమాపకశాఖ అనుమతి తప్పనిసరి

ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించాల్సిందే

ఇప్పటివరకు 50 దరఖాస్తులు..

49 దుకాణాలకు అనుమతులు మంజూరు

సంగారెడ్డి డీఎఫ్‌వో నాగేశ్వర్‌రావు



సంగారెడ్డిలో టపాసుల దుకాణం (ఫైల్)

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : దీపావళి సందర్భంగా ఏర్పాటు చేసే టపాసుల దుకాణాల యజమానులు తప్పకుండా అగ్నిమాపకశాఖ అనుమతి పొందాలని జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి (డీఎఫ్‌వో) బి.నాగేశ్వరరావు సూచించారు. సంగారెడ్డిలో శనివారం ఆయన మాట్లాడారు. ప్రతీ దుకాణదారుడు ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించాలని లేకపోతే లైసెన్స్ రద్దు చేస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వ అధికారులు నిర్దేశించిన స్థలంలోనే టపాసుల దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించి ఆన్‌లైన్‌లోనే అనుమతి పొందాలని సూచించారు. ఫైర్ సేఫ్టీ లైసెన్స్‌తో పాటు మున్సిపల్, రెవెన్యూ, పోలీస్ అనుమతులు కూడా తప్పనిసరి అన్నారు. పర్మినెంట్ టపాసుల దుకాణాల యజమానులు లైసెన్సు రిన్యువల్ కోసం రూ.2,500, తాత్కాలిక దుకాణాలు (2 వారాలకు) రూ.500 చెల్లించి అనుమతి పొందాలన్నారు. జిల్లాలోని టపాసుల దుకాణాలను క్షేత్ర స్థాయిలో సంబంధిత స్టేషన్ ఫైర్ ఆఫీసర్ తనిఖీ చేసి నివేదిక సమర్పిస్తే పూర్తిస్థాయిలో ఫైర్ సేఫ్టీ లైసెన్స్ అనుమతులు ఆన్‌లైన్‌లో జారీ చేస్తామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 50 టపాసుల దుకాణాల ఏర్పాటుకు దరఖాస్తులు వచ్చాయని 49 వాటికి అనుమతులు ఇచ్చామని జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి నాగేశ్వరరావు పేర్కొన్నారు.

పాటించాల్సిన నిబంధనలు

- టపాసుల దుకాణాలు జానావాసాల్లో ఏర్పాటు చేయకూడదు
- టపాసుల దుకాణాలను ఓపెన్ ఏరియాల్లోని రేకుల షెడ్లల్లోనే ఏర్పాటు చేయాలి.
- ప్రతీ దుకాణానికి మధ్య మూడు మీటర్ల దూరం ఉండాలి.
- ప్రతీ దుకాణంలో 2 డ్రమ్ముల్లో నీరు అందుబాటులో ఉంచాలి.
- విద్యుత్ భద్రతా చర్యలు తీసుకోవాలి.
- రెండు మంటలార్పే పరికరాలు అందుబాటులో ఉంచాలి.
- నో స్మోకింగ్ బోర్డులు ఏర్పాటు చేయాలి.

మత్తు.. కొత్త ఎత్తు!!





గంజాయి రవాణాలో కొత్త పుంతలు!

అరకు టు సంగారెడ్డి.. హష్ ఆయిల్ రూపంలో చేరవేత

ఎండు గంజాయి రవాణాపై పోలీసుల ఉక్కుపాదం

రూటు మార్చి ఏమార్చేందుకు స్మగ్లర్ల ఎత్తుగడలు

గంజాయి రవాణాపై పోలీసులు ఉక్కుపాదం మోపుతుండడంతో స్మగ్లర్లు కొత్తదారులు వెతుకుతున్నారు. ఎండు గంజాయి రవాణా చేస్తుండగా పట్టుబడుతుండడంతో.. రూటు మార్చి హష్ ఆయిల్ రూపంలో చేరవేస్తున్నారు. అరకు టు సంగారెడ్డి హష్ ఆయిల్ దందా జోరుగా సాగుతున్నట్టు తెలుస్తున్నది.

సంగారెడ్డి క్రైం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఇప్పటివరకు హైదరాబాద్ నగరానికే పరిమితమైన హష్ ఆయిల్ (గంజాయి లిక్విడ్) శివారు ప్రాంతమైన సంగారెడ్డి జిల్లాలోకి ప్రవేశించింది. పెద్ద బస్తాల్లో గంజాయి రవాణా చేయడంతో పోలీసులకు దొరికిపోతుండడంతో.. పోలీసుల కళ్లు కప్పడానికి గంజాయిని లిక్విడ్ రూపంలోకి మార్చి చిన్న బాటిళ్లలో సరఫరా చేస్తున్నారు. హష్ ఆయిల్ అరకులో ఎక్కువగా లభ్యమవుతోంది. స్మగ్లర్లు అరకు నుంచి హైదరాబాద్ మీదుగా సంగారెడ్డి జిల్లా శివారులోని అమీన్‌పూర్, లింగంపల్లి, పటాన్‌చెరు ప్రాంతాల్లో ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారు. కాలేజీల్లో చదివే విద్యార్థులు, పరిశ్రమల్లో పనిచేసే కార్మికులే టార్గెట్‌గా చేసుకొని హష్ ఆయిల్‌ను గుట్టుచప్పుడుకాకుండా అమ్ముతున్నారు. దీనికి అలవాటు పడిన....

మిగతా 8వ పేజీలో

కారు బోల్తాపడి..

కథ అడ్డం తిరిగింది

డివైడర్ ఢీకొట్టిన కారు.. బయటపడ్డ గంజాయి

వాహనం వదిలేసి పరారైన స్మగ్లర్లు

32 ప్యాకెట్లలో 88 కేజీల గంజాయి స్వాధీనం



బోల్తాపడిన కారు

రామాయంపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా రామాయంపేటలో ఓ కారు డివైడర్‌ను ఢీకొని బోల్తాపడగా.. అందులో భారీగా ఎండు గంజాయి బయటపడింది. హైదరాబాద్ నుంచి కామారెడ్డి రూట్‌లో వెళ్తున్న కారు శనివారం ఇక్కడి బైపాస్‌లో అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో గంజాయి అక్రమ రవాణా చేస్తున్న వ్యక్తులు తీవ్రంగా గాయపడి.. కారును వదిలేసి పారిపోయారు. తెల్లవారుజామున అటుగా వెళ్లిన పెట్రోలింగ్ పోలీసులు పరిశీలించగా కారులో గంజాయి ఉన్నట్లు తేలింది. ఎస్ఐ బాలరాజ్‌కు సమాచారం అందించి.. కారులో తనిఖీ చేయగా 32 ప్యాకెట్లలో 88 కేజీలు గంజాయి ఉన్నట్లు గుర్తించారు. ఘటనా స్థలానికి క్లూస్‌టీంను రప్పించిన పోలీసులు విచారణ ముమ్మరం చేశారు. ఎక్కడి నుంచి గంజాయి అక్రమ రవాణా చేస్తున్నారు..! సదరు వ్యక్తులు ఎవరు..? అన్నదానిపై వివిధ కోణాల్లో దర్యాప్తు జరుగుతోంది. గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



పట్టుబడిన గంజాయి

రైతుల కోసం వంతెన

వ్యవసాయ భూములకు వెళ్లేందుకు.. సొంత ఖర్చుతో నిర్మించిన రైతు

వర్షం వస్తే పొంగిపొర్లే గుండవాగు ● పట్టించుకోని అధికారులు..

రూ.2 లక్షలు వ్యయంతో వంతెన కట్టించిన రైతు

7



సోయా.. మద్దతు లేదయా!

కొనుగోలు కేంద్రాల్లేక దళారుల ఇష్టారాజ్యం

తేమ పేరిట నిలువు దోపిడీ..

కంగ్టిలో సెంటర్ ఏర్పాటు చేయాలని

రైతుల డిమాండ్

7





అల్లాదుర్గంలోని సివిల్ కోర్టును ప్రారంభిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి బి.విజయ్‌సేన్‌రెడ్డి

ప్రజల వద్దకే న్యాయసేవలు

- కొత్త చట్టాలతో ప్రజలకు మేలు
- హైకోర్టు జస్టిస్ విజయసేన్‌రెడ్డి
- అల్లాదుర్గం సివిల్ కోర్టు ప్రారంభం

మెదక్ అర్బన్/అల్లాదుర్గం/పాపన్నపేట అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రజల వద్దకే న్యాయ సేవలు చేరవేయడానికి చర్యలు తీసుకుంటున్నామని హైకోర్టు జస్టిస్ విజయసేన్‌రెడ్డి పేర్కొన్నారు. మెదక్ జిల్లాలో శనివారం ఆయన విస్తృతంగా పర్యటించారు. ఆయనకు కలెక్టర్ రాహుల్‌రాజ్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీశారద, ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం అల్లాదుర్గం మండల కేంద్రానికి చేరుకుని నూతనంగా మంజూరైన సివిల్ కోర్టును ప్రారంభించారు. రీటా లాల్ చందర్ న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు సత్వర న్యాయం అందించేందుకే నూతన న్యాయస్థానం ఏర్పాటు చేశామన్నారు. పరస్పర సహకారం, శాంతితోనే అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. కొత్త చట్టాలతో రావడంతో ప్రజలకు మేలు జరుగుతుందని అన్నారు. సుప్రీం కోర్టు జడ్జిమెంట్ ప్రకారం మెయింటెనెన్స్ కేసులు త్వరగా పరిష్కరించాలన్నారు. చైల్డ్ కస్టడీ, విడాకులు, క్రిమినల్‌కు సంబంధించిన కేసులు ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలన్నారు. జిల్లాలో లీగల్ సర్వీస్ అథారిటీ పనితీరు బాగుందని కొనియాడారు. మెదక్ జిల్లాతో తనకు ఎంతో అనుబంధం ఉందని, తాను జిల్లావాసినేనని చెప్పారు. అనంతరం మెదక్, నర్సాపూర్, జోగిపేట, సంగారెడ్డి, నారాయణఖేడ్ బార్ అసోసియేషన్స్ అధ్వర్యంలో హైకోర్టు జడ్జిని శాలువాలు, మెమొంటోలతో ఘనంగా సత్కరించారు.

ఏడుపాయల, మెదక్ చర్చి సందర్శన

హైకోర్టు జస్టిస్ విజయసేన్‌రెడ్డి ఏడుపాయల వనదుర్గామాత ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ సిబ్బంది, అర్చకులు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. అనంతరం మెదక్‌లోని ప్రఖ్యాత సీఎస్ఐ చర్చిని సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం మెదక్ కోర్టు ప్రాంగణంలో ప్రథమ చికిత్స కేంద్రాన్ని ప్రారంభించి పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమాల్లో సీనియర్ సివిల్ జడ్జి జితేందర్, నర్సాపూర్ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి అనిత, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శి సుభాష్‌గౌడ్, శ్రీపతి రావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

వాయుగుండం..

రైతుకు గండం

భయపెడుతున్న అకాల వర్షాలు

కల్లాల్లో ధాన్యం.. తడిసిపోతాయనే ఆందోళన

పూర్తిస్థాయిలో ప్రారంభం కాని కొనుగోలు కేంద్రాలు



వెల్దుర్తిలో ధాన్యం తడవకుండా టార్పాలిన్లు కప్పిన దృశ్యం

మెదక్, అక్టోబరు 19, (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కురుస్తున్న అకాల వర్షాలు రైతులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఓ వైపు కోతలు, మరో వైపు కల్లాల్లో ధాన్యం ఆరబెట్టిన సమయంలో అక్కడక్కడా చిరుజల్లులు మొదలుకొని.. ఓ మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. దీంతో పంటను కాపాడుకునేందుకు రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. ఆకాశంలో మబ్బులు కమ్ముకోగానే.. టార్పాలిన్లు కప్పి, అక్కడే పడిగాపులు కాస్తున్నారు. వాస్తవానికి వ్యవసాయ సీజన్ ఆరంభంలో రైతులు దుక్కులు దున్ని వర్షాల కోసం ఎదురు చూశారు. సమయానికి వర్షాలు కురియక దిగాలు పడ్డారు. తర్వాత ఊహించని స్థాయిలో వర్షాలు కురిశాయి. భారీ వర్షాలకు పలు చోట్ల పంటచేలు దెబ్బతిన్నాయి. బంగాళఖాతంలో వాయుగుండం కారణంగా శనివారం జిల్లాలో పలు చోట్ల తేలిక పాటి వర్షాలు కురిశాయి. ఈ నేపథ్యంలో మరో రెండు మూడు రోజుల వరకు వరి కోతలు వద్దని, కోసిన వరిని కుప్పలుగా భద్ర పరచాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

కల్లాల్లో ధాన్యం

వ్యవసాయ సీజన్ మొదట్లో వరి సాగు చేసిన, కోత మిషన్లలో కోతలు చేసిన రైతులు కల్లాల్లో ధాన్యం ఆరబెట్టుకుంటున్నారు. మరి కొందరు రైతుల ధాన్యం కల్లాల్లోనే ఉంది. కొల్చారం, రామాయంపేట, నిజాంపేట ,వెల్దుర్తి పాపన్నపేట మండలాల పరిధిలో రైతులు రహదారులపై వడ్లు ఆరబోస్తున్నారు. నేపథ్యంలో వాయుగుండం ప్రభావంతో వర్షాలు కురిస్తే ధాన్యం పూర్తిగా తడిసిపోయే ప్రమాదం ఉంది. అలాగని.. కోసిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి ఆరబెట్టుకుందామంటే పూర్తిస్థాయిలో కేంద్రాలు ప్రారంభం కాలేదు. ఇక జిల్లా వ్యాప్తంగా 12 వేల టార్పాలిన్లు అవసరమని అధికారులు అంచనా వేశారు. గత కొనుగోళ్ల సీజన్‌లో కేంద్రాల నిర్వాహకులకు సుమారు 9 వేల టార్పాలిన్లు అందజేయగా, అవి వారి వద్దే ఉన్నాయి. మరో రెండు వేల టార్పాలిన్లు అవసరం అని భావిస్తుండగా, మరో రెండు మూడు రోజుల్లో వాటినీ సమకూర్చుతామని అధికారులు చెబుతున్నారు. దీంతో చేతికి వచ్చిన పంట ఏమైపోతోందో అన్న ఆందోళన అన్నదాతలను వెంటాడుతోంది.

240 కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

జిల్లాలో ఈ వానాకాలం వ్యవసాయ సీజన్‌లో జిల్లాలో 2.97 లక్షల ఎకరాల్లో వరిపంట సాగైంది. దొడ్డురకం 5,19,000 మెట్రిక్ టన్నులు, సన్నరకం 2,30,960 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. ఇందులో సన్నరకం 1.20 లక్షల మెట్రిక్ టన్నులు, దొడ్డు రకం 2.80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని, మిగతా రైతులు వారి అవసరాలకు, ప్రైవేట్ వ్యాపారులకు విక్రయించే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఇందుకోసం పౌరసరఫరాల శాఖ, సహకార, ఐకేపీ, ఎఫ్‌పీవోల ఆధ్వర్యంలో మొత్తం 484 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. సన్నాల కొనుగోళ్లకు 93 కేంద్రాలు, దొడ్డు రకం ధాన్యం కొనుగోళ్లకు 390 ఏర్పాటు చేయనున్నారు. మెదక్‌హవేలీఘనపూర్, పాపన్నపేట, కొల్చారం, కౌడిపల్లి శివంపేట, రామాయంపేట, నిజాంపేట, పెద్దశంకరంపేట తదితర మండలాలలో ఇప్పటికే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. శనివారం వరకూ జిల్లాలో మొత్తం 230 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. సుమారు 6 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు పౌరసరఫరాల శాఖ అధికారులు తెలిపారు.



హత్నూర ఐటీఐని పరిశీలిస్తున్న కలెక్టర్ క్రాంతి

ప్రభుత్వ కార్యాలయాల్లో కలెక్టర్ తనిఖీ

- కేజీబీవీ, గురుకుల పాఠశాలలో విద్యాబోధన తీరుపై ఆరా
- తహసీల్దార్ కార్యాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిశీలన

హత్నూర, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన హత్నూరలోని ప్రభుత్వ కార్యాలయాలను సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. హత్నూర గురుకుల ఐటీఐతో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, గురుకుల పాఠశాల, కస్తూర్బా గాంధీ విద్యాలయం, తహసీల్దార్ కార్యాలయాలను పరిశీలించారు. సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కస్తూర్బా గాంధీలో విద్యాబోధన తీరును పరిశీలించారు. ఉపాధ్యాయులు చెప్పే బోధన తీరు ఎలా ఉందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి రోగులతో కరచాలనం చేసిన కలెక్టర్ వారితో కొద్దిసేపు ముచ్చటించారు. అక్కడ నిరుపయోగంగా ఉన్న ఆపరేషన్ థియేటర్‌ను వినియోగంలోకి తీసుకురావాలని డాక్టర్లను ఆదేశించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో శిథిలావస్థకు చేరిన రికార్డుల గదులను పరిశీలించారు. భవనం శిథిలావస్థకు చేరడంతో పాటు ప్రహరీ లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని తహసీల్దార్ ఫర్హీన్ షేక్ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు.

ఐటీఐలో అన్ని వసతులు సమకూర్చుతాం..

హత్నూర గురుకుల ఐటీఐలో వసతులు సమకూర్చుతామని కలెక్టర్ క్రాంతి అన్నారు. ఐటీఐలోని వివిధ ట్రేడ్లను పరిశీలించారు. ఐటీఐలో ఏర్పాటుచేయనున్న ఏటీసీ కోసం ప్రిన్సిపాల్ సుబ్బలక్ష్మిని అడిగి తెలుసుకున్నారు. ఆమెవెంట తహసీల్దార్ ఫర్హీన్ షేక్, ఎంపీడీవో శంకర్, ప్రిన్సిపాల్స్ సుబ్బలక్ష్మి, భిక్షమయ్య, జయలక్ష్మి, నాయబ్ తహసీల్దార్ దావూద్, ఆర్ఐ శ్రీనివాస్ ఉన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



యాదయ్య(ఫైల్)

వెల్దుర్తి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): అడవి పందుల నుంచి పంటను రక్షించుకోవడానికి ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలకు ఓ రైతు తగిలి మృతిచెందాడు. ఈ సంఘటన మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం యశ్వంతరావుపేట గ్రామంలో చోటు చేసుకున్నది. ఎస్ఐ రాజు వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గుండెని యాదయ్య(46) శుక్రవారం రాత్రి ఇంట్లో భోజనం ముగించుకుని పొలం వద్దకు అడవి పందుల కాపలాకు వెళ్లాడు. శనివారం ఉదయం చూసేసరికి వన్యప్రాణుల నుంచి పంట రక్షణ కోసం ఏర్పాటుచేసిన విద్యుత్ తీగలకు తగిలి మృతిచెంది ఉన్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తూప్రాన్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఇందిర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడి ఇద్దరు కుమారులు ఉన్నారు.

మంత్రాలు చేస్తున్నాడని కుటుంబంపై దాడి

- మృతిచెందిన కుటుంబ పెద్ద ఆత్మ తిరుగుతుందని..
- మెదక్ జిల్లా తూప్రాన్ మండలం కిష్టాపూర్‌లో ఘటన



దాడికి గురైన భూమొళ్ల కమలమ్మ కుటుంబీకులు

తూప్రాన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మంత్రాలు చేస్తున్నాడని ఓ కుటుంబంపై దాడికి పాల్పడిన సంఘటన మెదక్ జిల్లా తూప్రాన్ మండలం కిష్టాపూర్‌లో శనివారం చోటు చేసుకున్నది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన భూమొళ్ల పోచయ్య మూడు నెలల క్రితం మృతిచెందాడు. పోచయ్య చనిపోవడంతో భార్య భూమొళ్ల కమలమ్మ, కుమారుడు భూమొళ్ల స్వామి, కోడలు నవనీతలతోపాటు బిడ్డలు, అల్లుళ్లను రప్పించి పెద్దలకు పండుగ చేశారు. పండుగ చేయడం గిట్టని కొందరు కులస్తులు శనివారం ఉదయం పోచయ్య ఆత్మ మా ఇళ్ల చుట్టూ తిరుగుతుందని కమలమ్మ ఇంటికి వచ్చారు. చౌరస్తా వద్దకు పిలుచుకుపోయి బిందెతో వళ్లు పట్టారు. కొందరు పూనకాలు ఊగుతూ.. కొందరి పేర్లను చదివారు. ఏమీ లేదంటూ ఇళ్లకు పంపించారు. కొద్దిసేపటికి మళ్లీ ఇంటి వద్దకు వచ్చి స్వామిని బయటకు పిలిచారు. మంత్రాలు చేస్తున్నావని, పోచయ్య ఆత్మ తిరుగుతుందని దుర్భాషలాడుతూ దాడిచేశారు. అడ్డువచ్చిన తల్లి కమలమ్మ, కోడలు నవనీతపై కూడా దాడికి పాల్పడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివానందం వివరించారు.

'గుణాత్మక బోధన అందించాలి'



మాట్లాడుతున్న డీఈవో వెంకటేశ్వర్లు

జిన్నారం/నిజాంపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు గుణాత్మకమైన బోధన అందించాలని డీఈవో వెంకటేశ్వర్లు సూచించారు. శనివారం మండలంలోని కొడకంచి ప్రభుత్వ పాఠశాలను ఆయన సందర్శించి, విద్యార్థుల తల్లిదండ్రులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఉపాధ్యాయులు విద్యా అభివృద్ధికి కృషి చేయాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ప్రతిరోజు తమ పిల్లలు పాఠశాలకు హాజరయ్యేలా చూడాలని కోరారు. పదో తరగతిలో వందశాతం ఫలితాలు సాధించేందుకు సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ప్రేమావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విద్యార్థులకు టీవీ, మొబైల్స్ దూరంగా ఉంచి పరీక్షలకు సన్నద్ధం చేయాలని ప్రధానోపాధ్యాయుడు పద్మారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని రాంపూర్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో శనివారం విద్యార్థులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

సంగారెడ్డి క్రైం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందినట్లు పట్టణ సీఐ ఎస్.భాస్కర్ తెలిపారు. శనివారం ఉదయం 6 గంటల ప్రాంతంలో 35 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి పాతబస్టాండ్ సమీపంలో స్పృహ లేకుండా పడి ఉన్నాడు. బస్టాండ్ ఆర్టీసీ కంట్రోలర్ మెట్టు కిషన్ 100 నంబర్‌కు డయల్ చేసి ఫిర్యాదు చేయగా.. అతడిని 108 సిబ్బంది సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు అతడికి వెంటిలేటర్‌పై ఉంచి వైద్య చికిత్స అందిస్తుండగా మృతిచెందినట్లు సీఐ తెలిపారు. మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచినట్లు చెప్పారు. సదరు వ్యక్తి ఒంటిపై క్రీం కలర్ ప్యాంటు, లేత ఆకుపచ్చ రంగు హాఫ్ టీ షర్ట్ ఉందని తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 08455 276333 లేదా 8712656718 నంబర్లకు సమాచారం ఇవ్వాలని సీఐ భాస్కర్ కోరారు.

క్రైం కార్నర్

పరిశ్రమ సంపులో పడి కార్మికుడి మృతి



రాజేష్‌కుమార్ మృతదేహం

జిన్నారం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): సంపులో ప్రమాదవశాత్తు పడి కార్మికుడు మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే భద్రాద్రి జిల్లా భద్రాచలంకు చెందిన రాజేష్‌కుమార్ (31) గడ్డపోతారం పారిశ్రామిక వాడలోని సెల్‌మార్ ల్యాబ్ పరిశ్రమలో పని చేస్తున్నాడు. శనివారం ఉదయం విధులకు హాజరైన రాజేష్‌కుమార్ బ్రైన్ ట్యాంకు(సంపు)లో ప్రమాదవశాత్తు పడి మృతి చెందాడు. సమాచారం అందుకున్న బొల్లారం సీఐ గంగారం, సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని కార్మికుడి మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. యాజమాన్యం నిర్లక్ష్యంతోనే రాజేష్‌కుమార్ మరణించాడని, అతడి కుటుంబానికి రూ.50లక్షల నష్ట పరిహారం చెల్లించాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు రాజయ్య డిమాండ్ చేశారు.

చెరువులో పడి వ్యక్తి..



శ్రీనివాస్(ఫైల్)

చేగుంట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన నార్సింగి మండల పరిధిలోని నర్సంపల్లిలో శనివారం ఉదయం చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై అహ్మద్ మోహినుద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ఉడుత శ్రీనివాస్ (50) స్థానిక మషిన్ చెరువులో చేపల వేటకోసం శుక్రవారం సాయంత్రం వల వేశాడు. మరుసటి రోజు తెల్లవారు జామున వలను తీసుకురావడానికి వెళ్లిన శ్రీనివాస్‌కు ఫిట్స్ రావడంతో వల చుట్టుకుని నీటమునిగి మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని శవపంచనామా నిర్వహించారు. భార్య యాదమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

డీసీఎం ఢీకొని వ్యక్తి..

మిరుదొడ్డి, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి) : డీసీఎం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే భూంపల్లి గ్రామానికి చెందిన పర్స నారయణ(45) రిపేర్ కోసం ఇచ్చిన సైకిల్‌ను తెచ్చేందుకు మరో వ్యక్తి మోటర్‌సైకిల్‌పై వెళ్తుండగా ఎదురుగా వచ్చిన డీసీఎం ఢీకొట్టింది. తీవ్రగాయాలపాలైన నారాయణను సిద్దిపేట ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్ బోల్తాపడి మహిళ..



సాయమ్మ(ఫైల్)

కౌడిపల్లి, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి) : ట్రాక్టర్ బోల్తాపడి మహిళ మృతి చెందిన సంఘటన మండలంలోని కూకుట్లపల్లిలో శనివారం జరిగింది. మృతుని కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని వెంకటపూర్ (బి) గ్రామానికి చెందిన బడిగంటి సాయమ్మ తన ఇంటి అవసరాల నిమిత్తం అదే గ్రామానికి చెందిన యాదగౌడ్ అనే వ్యక్తి ట్రాక్టర్‌ను కిరాయి తీసుకుని కౌడిపల్లికి వెళ్లి దస్తు (రాయి పొడి)ను లోడ్ చేయించుకుని వస్తున్నది. సాయమ్మ ట్రాక్టర్‌లోని దస్తుపై కూర్చోగా మల్లు కుంట సమీపంలోకి రాగానే ట్రాక్టర్ బోల్తా పడింది. దీంతో సాయమ్మ పూర్తిగా దస్తులో కప్పిపోయి అక్కడిక్కడే మృతి చెందగా డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. మృతురాలి కుమారుడి ఫిర్యాదు మేరకు కౌడిపల్లి ఎస్ఐ రంజిత్‌రెడ్డి కేసు నమొదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అదృశ్యమైన పదిరోజులకు చెరువులో శవమై..



దాసు(ఫైల్)

తూప్రాన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): అదృశ్యమైన వ్యక్తి చెరువలో శవ తేలిన సంఘటన తూప్రాన్‌లో చోటుచేసుకుంది. ఎస్ఐ శివానందం కథనం ప్రకారం మాసాయిపేట మండలం చెట్ల తిమ్మాయిపల్లి గ్రామానికి చెందిన బండెల దాసు(45) ఈ నెల 9న పక్క స్థలం వాళ్లు చెట్లు కొట్టగా అటవీ అధికారులకు ఫిర్యాదు చేసేందుకు మనోహరాబాద్‌కు వెళ్లి తిరిగిరాలేదు. పలు ప్రాంతాల్లో వెతికినా ఆచూకి లభించలేదు. కాగా, శనివారం తూప్రాన్ పెద్ద చెరువులో కుళ్లిపోయిన స్థితిలో మృతదేహం కనిపించింది. వెలికితీసి పరిశీలంగా శరీరంపై ఉన్న పచ్చబొట్టు ఆధారంగా బండెల దాసుగా గుర్తించారు. భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రైతుల కోసం వంతెన

తను.. తన వాళ్లు బాగుంటే చాలు అని ఆలోచిస్తున్న ప్రస్తుత తరుణంలో ఓ రైతు తన కోసమే కాకుండా తోటి రైతుల కోసం ఆలోచించాడు. ఎవరో వచ్చి తమ కష్టాలు తీరుస్తారని ఎదురు చూడకుండా తన సొంత ఖర్చుతో వాగుపై వంతెన నిర్మించాడు. ప్రభుత్వం, అధికార యంత్రాంగం చేయాల్సిన పని అతనొక్కడే పూర్తి చేయగా.. ఇప్పుడా వంతెనపై నుంచి వందలాది మంది రైతులు తమ వ్యవసాయ భూములకు వెళ్లి వస్తున్నారు. వర్షాకాలం వస్తే ప్రాణాలు అరచేత పట్టుకుని వాగుదాటే తమ కోసం రైతు చేసిన మేలును మరువలేమని అంటున్నారు.



రాములు నిర్మించిన వంతెన

- వ్యవసాయ భూములకు వెళ్లేందుకు..
- సొంత ఖర్చుతో నిర్మించిన రైతు
- వర్షం వస్తే పొంగిపొర్లే గుండవాగు
- పట్టించుకోని అధికారులు..
- రూ.2 లక్షలు వ్యయంతో కట్టిన రైతు

టేక్మాల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : అతనో సామాన్య రైతు. సాగు తప్ప మరో పని తెలియదు. వర్షాకాలం వచ్చిందంటే తన వ్యవసాయ భూమికి వెళ్లేందుకు వాగు అడ్డం వస్తుంది. పొంగిపొర్లే ఆ వాగులో ప్రవాహం తగ్గిన తర్వాతే తాను సాగు చేస్తున్న భూమికి వెళ్లాల్సిన పరిస్థితి. ఆ గ్రామంలోని రైతులందరిదీ అదే పరిస్థితి. తమ వ్యవసాయ భూములకు దారి కల్పించాలని.. ఇందుకోసం ఓ చిన్న వంతెన నిర్మించాలని ఆ రైతులు ఎన్నో సార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నా.. పట్టించుకునే వారే లేకుండా పోయారు. దీంతో ఎవరో వస్తారని.. ఏదో చేస్తారని ఎదురు చూడటం వృథా అనుకున్నాడా రైతు. అంతే, ఆయనే ఇంజనీర్‌గా మారి సొంత ఖర్చుతో ఏకంగా వంతెన నిర్మించాడు. తన పంట పొలాలకే కాదు.. రైతుల వందల ఎకరాలకు దారి చూపించాడు. దీనిపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతున్నది.

ఇదీ సంగతి..

మెదక్ జిల్లా టేక్మాల్‌కు చెందిన కుమ్మరి రాములు అనే రైతుకు ఇదే మండలంలోని గుండువాగు అవతల సుమారు 15 ఎకరాలు వ్యవసాయ భూమి ఉంది. అందులో పత్తి, వరి సాగు చేస్తాడు. అతనితో పాటు ఇతర రైతులకు చెందిన వందల ఎకరాల వ్యవసాయ భూములు ఉన్నాయి. ఇతర రోజుల్లో బాగానే ఉన్నా.. వర్షాకాలం వచ్చిందంటే ఆ రైతులకు పెద్ద కష్టం వచ్చి పడుతుంది. వారి వ్యవసాయ భూములకు వెళ్లాలంటే గుండు వాగు దాటాల్సిందే. అయితే, ప్రతీ సీజన్‌లోనూ ఆ వాగు నిండుగా ప్రవహించడంతో రైతులు తమ వ్యవసాయ భూములకు వెళ్లలేని పరిస్థితి. కొందరు ప్రాణాలు అరచేత పట్టుకుని వాగుదాటి వ్యవసాయ పనులు చేసుకునేవారు. అయితే, ఈ విషయాన్ని అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి.. గుండెవాగుపై వంతెన నిర్మిస్తే ప్రయోజనకరంగా ఉంటుందని విన్నవించారు. ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా.. ఎవరూ పట్టించుకోకపోవడంతో రైతు కుమ్మరి రాములు ముందుకు వచ్చారు. సొంత ఖర్చుతో గుండెవాగుపై వంతెన నిర్మించాడు. ముందుగా వేసవి కాలంలో వాగులో ఇనుప స్థంభాలు ఏర్పాటు చేశాడు. తర్వాత వాటిరి ఇనుప రాడ్లు పెట్టించి వంతెన పూర్తి చేశాడు. దీనికోసం రూ.2.10 లక్షలు ఖర్చు కాగా, ఒక రైతు రూ. 30 వేలు ఇవ్వగా, మిగిలిన డబ్బులన్నీ రాములు ఖర్చు చేశాడు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గుండువాగు నిండుగా ప్రవహించింది. ఈ సందర్భంలో రైతులు రాములు నిర్మించిన బ్రిడ్జి మీదుగా తమ వ్యవసాయ భూముల వద్దకు దర్జాగా వెళ్లి వచ్చారు. తమ వ్యవసాయ భూములకు ఏ సమయంలోనైనా వెళ్లి వచ్చేందుకు బ్రిడ్జి నిర్మించిన రాములును ఆ ప్రాంత రైతులు అభినందిస్తున్నారు. అతనికి రుణపడి ఉంటామని అంటున్నారు.

15 ఎకరాల భూమి ఉంది..



నాకు 15 ఎకరాల వ్యవసాయ సాగు భూమి ఉంది. అందులో వివిధ రకాల పంటను సాగు చేస్తుకుంటు జీవనం సాగిస్తాను. వర్షాలు కురిసి వరద వచ్చినప్పుడల్లా నాతోపాటు మరి కొంత మందిరైతులు తమ వ్యవసాయ పొలాలకు వెళ్లాలంటే గుండువాగు అడ్డం వచ్చేది. దీంతో ఇబ్బందులు పడేవాళ్లం. పొలం వద్దకు వెళ్లాలంటే వంతెన ఒక్కటే మార్గమని భావించాను. ఇందుకు రూ.2 లక్షలు ఖర్చు అవుతుందని అంచనా వేసి పనులు ప్రారంభించాను. 20 రోజుల్లో వంతెన పనులు పూర్తి చేశాను. అనుకున్న విధంగా వంతెన పూర్తి చేసినా.. ఇప్పుడు దానిపై షీట్ ఏర్పాటు చేయాల్సి ఉంది.

- రైతు కమ్మరి రాములు

రేపు ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టు ఎంపికలు

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 21న ఉమ్మడి మెదక్ జిల్లా జట్టు ఎంపికలు నిర్వహించనున్నట్లు ఉమ్మడి మెదక్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎ.రాజేందర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సంగారెడ్డి జుబ్లీక్లబ్ ప్రాంగణంలోని ఎంఎస్ అకాడమీలో అండర్-23 ఎంపికలు జరుగుతాయని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఉదయం 10 గంటల వరకు బర్త్ సర్టిఫికేట్, ఆధార్‌కార్డు, రెండు ఫొటోలతో హాజరుకావాలని సూచించారు. క్రీడాకారులు 1.9.2001 తర్వాత జన్మించిన వారై ఉండాలని, జిల్లా జట్టులో ఎంపికైన క్రీడాకారులు వచ్చే నెల 4 నుంచి జరిగే ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొంటారని పేర్కొన్నారు.

భూ తగాదాలతో అన్నపై కత్తితో దాడి

పాపన్నపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దాయాదుల మధ్య జరగుతున్న భూ పంచాయతీలో అన్నపై తమ్ముడు కత్తితో దాడి చేసిన సంఘటన శనివారం మండల పరిధిలోని నామాపూర్‌లో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన ముచ్చె చిన్న రామయ్య, ముచ్చె లక్ష్మయ్య సొంత అన్నదమ్ములు. రామయ్య కొడుకు ముచ్చె లింగమయ్య పేరిట 7 గుంటల భూమి ఎక్కువగా నమోదు అయ్యింది. ఆ భూమిని తిరిగి తన పేరిట చేసి ఇవ్వాలని లక్ష్మయ్య కొడుకు కుమార్ కోరుతున్నాడు. గత రెండేళ్లుగా ఈ వివాదం కొనసాగుతుంది. శనివారం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన పంచాయితీ వద్ద ఘర్షణ జరగగా ముచ్చె కుమార్ వేట కత్తితో లింగమయ్యపై దాడి చేయగా గొంతు, తలపై తీవ్ర గాయాలయ్యాయి. దీంతో గ్రామస్థులు కుమార్‌ను చితక బాదగా, అతడు పారిపోయి పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయినట్లు తెలిసింది. లింగమయ్యను మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ గౌడ్ వివరించారు.

ఈ ప్రధానోపాధ్యాయుడు మాకొద్దు..

- విద్యార్థులను అవహేళన చేస్తున్నాడు ● బదిలీ చేస్తేనే బడికి వస్తాం
- పద్ధతి మార్చుకోకుంటే చర్యలు తీసుకుంటాం: ఎంఈవో

చిన్నశంకరంపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): 'విద్యాబుద్ధులు నేర్పిస్తూ.. పాఠశాలను మెరుగైన స్థితిలో ఉంచాల్సిన ప్రధానోపాధ్యాయుడు చీటికి మాటికి తమను హేళన చేసి మాట్లాడుతున్నాడు.. ఈ హెచ్‌ఎం మాకొద్దు' అని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలం గజగట్లపల్లి ప్రాథమిక పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడు గాలయ్య మెదక్ మండలం వెంకటాపూర్ నుంచి ఇటీవల బదిలీపై వచ్చారు. ప్రతీ చిన్న విషయానికి విద్యార్థులతో అవహేళనగా ప్రవరిస్తూ కించపరుస్తున్నాడని, అతడిని ఇక్కడి నుంచి పంపిస్తేనే పాఠశాలకు వెళ్తామని విద్యార్థులు చెబుతున్నారు. శనివారం ఈ విషయయాన్ని విద్యార్థులు తమ తల్లిదండ్రులకు తెలపడంతో వారు పాఠశాలకు చేరుకుని గాలయ్యను నిలదీయడంతోపాటు డీఈవో రాధాకిషన్, ఎంఈవో పుష్పవేణికి ఫోన్ ద్వారా సమాచారమిచ్చారు. ఎంఈవో పాఠశాలకు చేరుకుని ప్రధానోపాధ్యాయుడితో మాట్లాడారు. తీరు మార్చుకోకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులతో చర్చించి మరోసారి ఈ విషయం మా దృష్టికి వస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటాని సర్దిచెప్పారు. విద్యార్థులకు సరైన బోధన అందించాలని ఎంఈవో ఉపాధ్యాయులకు ఆదేశించారు.



ప్రధానోపాధ్యాయుడితో మాట్లాడుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు



దిడిగి శివారులో అటవీ ప్రాంతంలో పారబోసిన వ్యర్థజలాలు

వ్యర్థజలాల పారబోత

- కలుషితమవుతున్న భూములు, ఎండిపోతున్న చెట్లు

జహీరాబాద్,అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దిడిగి శివారులోని అటవీ ప్రాంతంలో వివిధ రసాయన పరిశ్రమలకు చెందిన వ్యర్థజలాలను తీసుకువచ్చి పారబోయడంతో పరిసరప్రాంతాలు కలుషితమవుతున్నాయి. వర్షాలు కురుస్తున్న సమయాల్లో ఈ వ్యర్థ రసాయన జలాలు నేరుగా వదరతో కలిసి దిడిగి చెరువులోకి, అక్కడి నుంచి నారింజాలోకి వెళ్తున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భూమిలోకి ఇంకి భూగర్భ జలాలు విషపూరితంగా మారుతున్నాయన్నారు. దీంతో చెట్లన్ని ఎండిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రసాయనాలతో కలుషితమైన గడ్డిని మేసి, నీటి తాగి మూగజీవాలు మృత్యువాత పడే అవకాశం ఉందని గ్రామప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై వెంటనే స్పందించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని శనివారం గ్రామస్థులు సంబంధిత అధికారులకు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు.



ఎండిపోయిన చెట్లు

రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలి

- కలెక్టర్ రాహుల్‌రాజ్



అల్లాదుర్గం పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

అల్లాదుర్గం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ వైద్యాధికారులను ఆదేశించారు. శనివారం అల్లాదుర్గంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ ఆసుపత్రికి నిత్యం ఎంతమంది రోగులు వస్తున్నారని, ఏఏ సమస్యలు ఉన్నాయని స్థానిక వైద్యాధికారి డాక్టర్ అశ్వినిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ ఆసుపత్రులకు ధీటుగా ప్రభుత్వాసుపత్రిలో మెరుగైన వైద్యం అందుతుందన్నారు. అంటువ్యాధులు ప్రబలకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్యసిబ్బందికి సూచించారు. వైద్యాధికారులు, వైద్యసిబ్బంది పనితీరు పై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించారు.

ఎన్‌సీసీ కేడెట్ల ఎంపిక

మెదక్ అర్బన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సర విద్యార్థులకు శనివారం ఎన్‌సీసీ సెలక్షన్స్ ప్రక్రియ నిర్వహించారు. సంగారెడ్డి ఆర్మీ అధికారి మహేష్ బచత్, గురుప్రీత్ సింగ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎంపికలకు మొత్తం 200 మంది విద్యార్థులు పాల్గొన్న వారిలో ప్రాథమికంగా 100 మందిని ఎంపిక చేసినట్లు ఎన్‌సీసీ ఇన్‌చార్జి అధికారి సురేందర్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంపికైన విద్యార్థులకు మూడేళ్లపాటు శిక్షణ ఇస్తామని, దీన్ని ద్వారా ఆర్మీ, పోలీసు, సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ తదితర ఉద్యోగాలకు అర్హతను పొందవచ్చునన్నారు.



ఎన్‌సీసీ కేడెట్ల ఎంపికలో విద్యార్థులు

విద్యార్థుల ఆటోను ఢీకొట్టిన ట్రాలీ ఆటో

- ఒకరికి తీవ్ర గాయాలు



చికిత్స పొందుతున్న విద్యార్థి ప్రేమ్

చేగుంట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): చేగుంట ఆదర్శ పాటశాల విద్యార్థులను తరలిస్తున్న ఆటోను ముందు నుంచి ట్రాలీ ఆటో ఢీ కొనడంతో ఒక విద్యార్థికి తీవ్రగాయాలైన సంఘటన శనివారం సాయంత్రం చేగుంట బైపాస్ బ్రిడ్జి వద్ద చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే చేగుంట ఆదర్శ పాఠశాలకు నిత్యం ఆటోలో విద్యార్థులు వెళ్లివస్తుంటారు. రోజు మాదిరిగానే విద్యార్థులను సాయంత్రం పాఠశాల నుంచి ఆటోలో ఎక్కించుకుని బయలుదేరగా చేగుంట బైపాస్ బ్రిడ్జి వద్దకు రాగానే ఎదురుగా ట్రాలీ ఆటో వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఆటోలో ఐదుగురు విద్యార్థులు కూర్చోగా.. అఖిల్, అజేయ్, ప్రణీత, అంజలీ నల్గురు ఆటో వెనుకలో కూర్చున్నారు. డ్రైవర్ పక్కన కూర్చున్న ఎనిమిదో తరగతి విద్యార్థి గడ్డం ప్రేమ్ ఎడమ కాలు నుజ్జునుజ్జయింది. అతడికి చేగుంటలో ప్రథమ చికిత్స అందించి తూప్రాన్‌లోని ఓ ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు. అనంతరం అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. రోజూ విద్యార్థులను తీసుకెళ్లే డ్రైవర్ శుభకార్యం ఉందని వేరే వ్యక్తిని పంపించడంతో ఈ ప్రమాదం జరిగిందని విద్యార్థులు వాపోతున్నారు. మిగితా విద్యార్థులకు ఎలాంటి గాయాలు కాకపోవడంతో పెను ప్రమదం తప్పింది.



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాములు

దృష్టిని మరల్చడానికే హైడ్రామా

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వీరయ్య, చుక్కరాములు

జహీరాబాద్, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): ప్రజల దృష్టిని మళ్లించడానికే రాష్ట్ర ప్రభుత్వం హైడ్రా అనే డ్రామాకు తెరలేపిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వీరయ్య, చుక్కరాములు పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలో సీపీఎం జిల్లా 3వ మహాసభ శనివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. ప్రజల్లో నెలకొన్న అసంతృప్తిని దారి మళ్లించేందుకే ప్రభుత్వం హైడ్రా పేరిట డ్రామాను మొదలు పెట్టిందన్నారు. అఖిలపక్షంతో చర్చలు జరిపాకే మూసీ ప్రక్షాళన చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మల్లికార్జున్, మల్లారెడ్డి, మల్లేశం, జయరాజ్, రాజయ్య, మాణిక్యం, రాంచంద్రం, సాయిలు, మైపాల్, నర్సయ్య, రాజిరెడ్డి, చంద్రన్న, సంగన్న వీరగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సోయా.. మద్దతు లేదయా!

- కొనుగోలు కేంద్రాల్లేక దళారుల ఇష్టారాజ్యం
- తేమ పేరిట నిలువు దోపిడీ.. నష్టపోతున్న రైతులు
- కంగ్టిలో సెంటర్ ఏర్పాటు చేయాలని డిమాండ్



దెగుల్‌వాడిలో సోయాను ఆర బెడుతున్న రైతు

కంగ్టి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం శ్రమించి పంటలు పండించే రైతులకు తీరా పంట ఇంటికొచ్చే సరికి మద్దతు ధర లభించక దళారుల చేతిలో దగాపడుతున్నారు. వర్షాధార పంటలసాగు అధికంగా ఉన్న కంగ్టి మండలంలో ఈసారి ఖరీఫ్‌లో రైతులు 12 వేల ఎకరాల్లో సోయా సాగు చేశారు. ప్రస్తుతం పంట మొత్తం రాశులు చేసుకున్న రైతులు అమ్ముకుందామంటే స్థానికంగా కొనుగోలు కేంద్రం లేకపోవడంతో మద్దతు ధర దక్కడంలేదు. ఖరీఫ్‌లో సాగు చేసిన సోయాపంటకు కేంద్రప్రభుత్వం క్వింటాల్‌కు రూ.4892గా నిర్ణయించింది. కాని స్థానికంగా వ్యాపారులు మాత్రం రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని తేమ, తరుగు, నాసిరకం అంటూ కొర్రీలు పెడుతూ క్వింటాల్‌కు రూ.3800 నుంచి రూ.4200లకే కొంటున్నారు. దీంతో ఒక్క క్వింటాల్ సోయాపై రైతులు రూ.700 వరకు నష్టపోవాల్సి వస్తుంది. స్థానికంగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రం లేక పోవడంతో తప్పని పరిస్థితుల్లో రైతులు దళారులకే అమ్ముకోవాల్సి వస్తుంది. కంగ్టి మండలం రాష్ట్ర సరిహద్దుల్లో ఉండడంతో ఇక్కడి వ్యాపారులు సోయా పంటను రైతుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి పక్క రాష్ట్రాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఈసారి ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాల వల్ల సోయాపంట దిగుబడి బాగా తగ్గడం, ప్రస్తుతం మద్దతు ధర లభించకపోవడం తో రైతులు వాపోతున్నారు. సోయా సాగు అధికంగా ఉన్న కంగ్టి మండలంలో మార్క్‌ఫెడ్ అధికారులు స్పందించి స్థానికంగా సోయా కొనుగోలు కేంద్రంఏర్పాటు చేయాలని పలువురు రైతులు కోరుతున్నారు. ఈ విషయమై మండల వ్యవసాయాధికారి వెంకటేశంను సంప్రదించగా డీసీఎంఎస్ అధికారులతో చర్చించామని, ఇప్పటికే మనూరులో కొనుగోలు కేంద్రం ఉన్నందున కంగ్టిలో సబ్‌సెంటర్ ఏర్పాటుపై ఆలోచిస్తామని తెలిపారని ఆయన పేర్కొన్నారు.

కొనుగోలు కేంద్రాలతోనే రైతులకు మేలు : రవీందర్‌రెడ్డి



ఆరుగాలం శ్రమించి తాము పండించిన పంటకు గిట్టుబాటు ధర దొరకాలంటే ప్రభుత్వం రైతులకు అందుబాటులో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి. ఇప్పటికైనా ప్రభుత్వం ఆలోచించి ఆ దిశగా చర్యలు తీసుకోవాలి. చాలా మంది రైతులు తప్పని పరిస్థితుల్లో దళారులను ఆశ్రయించి ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతునానరు.

అనారోగ్యంతో వృద్ధుడి ఆత్మహత్య



రాజేశం(ఫైల్)

చిన్నకోడూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య సమస్యలతో బాధపడుతూ జీవితం పై విరక్తి చెందిన వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శనివారం జరిగింది. ఎస్ఐ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం చిన్నకోడూరుకు చెందిన వేములవాడ రాజేశం (70) సెంట్రింగ్ మేస్త్రీగా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గత కొన్నేళ్లుగా రాజేశం మోకాళ్ల నొప్పులు, బీపీ, షుగర్, తదితర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. దీనిపై కుటుంబ సభ్యులతో తరచూ చెబుతూ మనస్తాపానికి గురయ్యేవాడు. కాగా, శుక్రవారం రాత్రి రాజేశం అతని భార్య రాధ బిల్డింగ్‌పై గదిలో నిద్రిస్తున్నారు. తెల్లవారు జామున రాధకు చలిగా అనిపించడంతో కింద ఉన్న గదిలోకి వచ్చి పడుకుంది. ఉదయం కుటుంబ సభ్యులు రాజేశంను నిద్ర లేపేందుకు పైకి వెళ్లి చూడగా తలుపు లోపలివైపు గడియ వేసి ఉంది. కిటికిలో నుంచి చూడగా రాజేశం గది పై కప్పు ఇనుప రాడ్డుకు తాడుతో ఉరివేసుకొని కనిపించాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు యాదగిరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నిలువెత్తు నిర్లక్ష్యం



మండల కేంద్రంలోని చౌకీ ప్రాంతంలో గల అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రధాన రహదారిపై ప్రమాదకరంగా గుంతలు ఏర్పడినా పట్టించుకోనే నాథుడే కరువయ్యాడు. రాత్రి వేళల్లో ఈ ప్రాంతంలో ఎంతోమంది ద్విచక్రవాహనదారులు అదుపు తప్పి పడిపోయి గాయాలబారిన పడుతున్నారు. రోడ్డంతా గుంతలమయమై అధ్వానంగా మారినా రోడ్డును బాగు చేయకపోవడంతో అంబేడ్కర్ విగ్రహ పరిసరాల్లో పెద్దగా ఏర్పడిన గుంతలో వర్షం నీరు నిలిచి స్థానికుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా పరిణమించింది. ప్రధాన కూడలి ప్రాంతమైన అంబేడ్కర్ విగ్రహం పరిసరాల్లోనే పరిస్థితి ఇలా ఉంటే ఇక గ్రామాల్లోని రోడ్ల పరిస్థితి గురించి వేరే చెప్పనవసరం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుపై ప్రమాదకరంగా ఏర్పడిన గుంతలు పూడ్చివేసి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

- కోహీర్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి)

-= సంక్షిప్తం =-

తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన ట్రైనీ ఐఏఎస్‌లు

రామచంద్రాపురం, అక్టోబరు 19: రామచంద్రాపురం తహసీల్దార్ కార్యాలయాన్ని ఒడిస్సా రాష్ట్రానికి చెందిన ట్రైనీ ఐఏఎస్ సభ్యుల బృందం శనివారం సందర్శించింది. కార్యాలయానికి చేరుకున్న ఐఏఎస్ బృందం సభ్యులు ముందుగా తహసీల్దార్ సంగ్రామ్‌రెడ్డిని కలిశారు. అక్కడ నుంచి ధరణీ పోర్టల్, రిజిస్ట్రేషన్ విధానం గురించి తెలుసుకున్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో జరిగే అంశాల వివరాలను తెలుసుకున్నారు.

టీపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం నూతన కమిటీ ఎన్నిక

పెద్దశంకరంపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పెద్దశంకరంపేటమండలం టీపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘంనూతన కమిటీని శనివారం రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు హీరాలాల్ ఎన్నికల అధికారి పరిశీలకులుగా జిల్లాప్రధాన కార్యదర్శి వెంకటరామిరెడ్డి ముఖ్యఅతిథులుగా జిల్లా అధ్యక్షులు సంగయ్యల ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. తతపెద్దశంకరంపేట మండడలం టీపీటీఎఫ్ సంఘం అధ్యక్షులుగా టి.మారుతి, ప్రధానకార్యదర్శిగా మహ్మద్‌అబ్దుల్‌షమీ, ఉపాధ్యక్షులుగా బీతయ్య, సుగుణమని, సాయిబాబా, కార్యదర్శులుగా బార్గవ్, రాదిక, మౌనిక,జిల్లాకౌన్సిలర్‌గా విజయ్‌కుమార్,రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా ఎం.సంగమేశ్వర్,రాజేశ్వర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనలకు విద్యార్థులను సంసిద్ధం చేయండి: డీఈవో

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): వచ్చే నెల రెండో వారంలో జిల్లా స్థాయిలో రెండు విజ్ఞాన ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు డీఈవో వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శనకు జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో 6 నుంచి 10 వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. సుస్థిర భవిష్యత్తు కోసం సైన్స్ అండ్ టెక్నాలజీ అనే అంశంపై ప్రదర్శన ఉంటుందని తెలిపారు. అదే విధంగా ఇన్‌స్పైర్ అవార్డు ప్రదర్శన ఉంటుందని, ఇందుకోసం జిల్లాలోని అన్ని పాఠశాలల విద్యార్థులను సంసిద్ధులను చేయాలని ఆయన సూచించారు.

'ఉపాధి పనులు వేగవంతం చేయాలి'

చేగుంట ,అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): చేగుంట మండల పరిషత్ కార్యలయంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాస్ రావు జాతీయ గ్రామీణ ఉపాధి హామీపథకం పై శనివారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలో జాతీయ ఉపాధి హామీథకం పనుల కోసం గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి ప్రజల అభిప్రాయ సేకరణ చేసి పనులను వేగవంతం చేయాలన్నారు. ఈ సంవత్సరం 60 శాతం పండ్ల తోటల పెంపకం, ఫాం పాండ్స్, ఫిష్ పాండ్స్, పశువు పాకలు ప్రతీ గ్రామ పంచాయతీలో చేపట్టే విధంగా ప్రణాళిక చేసుకొని మార్చి నెలాఖరు వరకు పనులు పూర్తి చేసి పురోగతి సాధించాలని అధికారులకు సూచించారు.

గోసాయిపల్లి రహదారి పనులకు రూ. 1.79 కోట్లు మంజూరు

కల్హేర్, అక్టోబరు 19; సిర్గాపూర్ మండల పరిధిలోని గోసాయిపల్లి గ్రామానికి బీటీ రహదారి నిర్మాణానికి గానూ పంచాయతీరాజ్ శాఖ గ్రామీణ రహదారుల విభాగం ద్వారా సీఆర్ఆర్ గ్రాంట్స్ కింద రూ.1.79 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వ కార్యదర్శి లోకేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. 2.17 కిలోమీటర్ల పొడవున్న ఈ రహదారి నిర్మాణానికి గానూ నిధులు మంజూరు చేయించిన ఎంపీ సురేష్‌కుమార్ షెట్కార్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే పి. సంజీవరెడ్డిలకు గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

పంచాయతీ కార్యాలయాల తనిఖీ

నాగల్‌గిద్ద, అక్టోబరు 19: మండలపరిధిలోని ముక్తాపూర్, వల్లూర్ గ్రామ పంచాయతీ కార్యాలయాలను శనివారం నాగల్‌గిద్ద ఎంపీడీవో మహేశ్వర్‌రావు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయాల్లో పలురికార్డులను పరిశీలించడంతో పాటు గ్రామాల్లో పారిశుధ్యం నిర్వహణ తదితర అంశాలపై పంచాయతీ కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు.

పట్టభద్రుల ఎన్నికలకు గడువులోపు ఓటు హక్కు నమోదు చేసుకోవాలి

శివ్వంపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రానున్న పట్టభద్రుల ఎన్నికల కోసం ఓటు హక్కు పొందేందుకు సీఈవో తెలంగాణ వెబ్ సైట్ లేదా ఆఫ్ లైన్ ద్వారా ఓటు హక్కు నమోదు చేసుకోవాలని శివ్వంపేట తహసీల్దార్ కమలాద్రి ఉప తహసీల్దార్ షఫియోద్దీన్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తహసీల్దార్ కమలాద్రి మాట్లాడుతూ నవంబర్ 6వ తేదీ వరకు చివరి గడువు ఉంటుందన్నారు.

● తూప్రాన్, అక్టోబరు 19: ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి అవగాహన కల్పించారు. శనివారం తూప్రాన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు ఓటరు నమోదుపై ఆర్డీవో జయచంద్రారెడ్డి అవగాహన కల్పించి, ఓటరు నమోదు చేసుకోవాలన్నారు. బాధ్యతగా ఉపాధ్యాయ, పట్టభద్రుల ఓటరుగా నమోదు చేసుకోవాలని ఆర్డీవో పేర్కొన్నారు.

'విద్యార్థులు ఇష్టపడి చదవాలి'

మునిపల్లి, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివినప్పుడే ఉన్నత శిఖరాలకు ఎదుగుతారని సీఎంవో ఎస్ఎస్ఏ వెంకటేశం విద్యార్థులకు సూచించారు. శనివారం మండల పరిధిలోని మల్లికార్జున్ పల్లి జడ్పీహెచ్‌ఎస్, ఎంపీపీఎస్ పాఠశాలల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆయన సూచనలు చేశారు.

అంగన్‌వాడీలో కుళ్లిన కోడిగుడ్ల పంపిణీ

● కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని గ్రామస్థుల డిమాండ్.. కార్యకర్తకు మెమో జారీ

కల్హేర్, అక్టోబరు 19: సంగారెడ్డి జిల్లా నిజాంపేట మండల పరిధిలోని దామరచెరు గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం నుంచి పంపిణీ చేసిన గుడ్లు కుళ్లిపోయి ఉండటంతో గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం బాలింతలు, గర్భిణులు, శిశువులకు స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో సిబ్బంది గుడ్లను పంపిణీ చేశారు. అదేరోజు రాత్రి గ్రామస్థులు వారి ఇంటి వద్ద ఆ గుడ్లను పగులగొట్టి చూడగా కుళ్లిపోయి ఉన్నట్లు గుర్తించారు. ఇలా శిశువులకు, గర్భిణులకు పౌష్టికాహార రూపంలో అందజేసే గుడ్లు కుళ్లిపోయి ఉండటం ఏమిటని గ్రామస్థులు ప్రశ్నించారు. గుడ్లను పంపిణీ చేసే కాంట్రాక్టరు నిర్లక్ష్యంగా వ్యవహరించడం మూలంగానే ఇలాంటి గుడ్లు పంపిణీ జరుగుతున్నాయని, కాంట్రాక్టరుపై చర్యలు తీసుకుని ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని దామరచెరు గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఈ విషయమై నారాయణఖేడ్ ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి సుజాత, కల్హేర్ సూపర్‌వైజర్ ప్రమీల శనివారం వివరణ ఇస్తూ కాంట్రాక్టరు నిర్లక్ష్యం ఫలితంగా ఇలా జరిగిందని, తాము దామరచెరు లోని అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి కుళ్లిన గుడ్ల గురించి విచారణ చేశామన్నారు. అంగన్‌వాడీ కేంద్రానికి పంపిణీ చేసిన గుడ్లలో కొన్ని మాత్రమే కుళ్లిపోయాయని, వాటిని నీటిలో వేసి పరిశీలించి ఇవ్వకుండా కార్యకర్త నిర్లక్ష్యం చేసిందన్నారు. సకాలంలో తమకు సమాచారం అందించని అంగన్‌వాడీ కార్యకర్తకు మెమో జారీ చేశామని, మరో సారి ఇలా జరుగకుండా చూస్తామని తెలిపారు.



దామరచెరు గ్రామంలో పంపిణీ చేసిన కుళ్లిన గుడ్లు

హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం



పెద్దశంకరంపేటలో సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

నిజాంపేట/పెద్దశంకరంపేట/నర్సాపూర్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి) రైతుల ఖాతాల్లో పెట్టుబడి సాయం కింద రైతుబంధు నిధులను కాంగ్రెస్ ప్రభుత్వం జమ చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ మెదక్ జిల్లాలోని పలు మండలాల్లో శనివారం బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్‌ప్రభుత్వం రైతులను మోసం చేస్తుందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని పేర్కొన్నారు. వెంటనే రైతుల ఖాతాల్లో రైతుబంధు నిధులను జమచేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు నిజాంపేట, పెద్ద శంకరంపేట, నర్సాపూర్ మండలాల్లో సీఎం దిష్టిబొమ్మల దహనం కార్యక్రమాలను చేపట్టారు. నిజాంపేట మండలకేంద్రంలో బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు సుధాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మండల యువజన అధ్యక్షుడు మావురం రాజు, మాజీ కో ఆప్షన్ సభ్యులు అబ్దుల్ అజీజ్, స్వామి గౌడ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు. పెద్దశంకరంపేటలో నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు. నర్సాపూర్ పట్టణంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బబియానాయక్, బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు శేఖర్, ఆత్మకమిటీ మాజీ ఛైర్మన్ శివకుమార్, మాజీ ఎంపీపీ నర్సింగ్ రావు, మాజీ సర్పంచులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రేవంత్... రైతు భరోసా ఇంకెప్పుడిస్తావ్?

● సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



సంగారెడ్డి రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రైతు భరోసా ఇంకెప్పుడిస్తావ్.. రేవంత్‌రెడ్డి' అని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ప్రశ్నించారు. సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఎన్నో ప్రగల్భాలు పలికి అధికారంలోకి వచ్చిన తరువాత ఉన్న పథకాలను ఎలా ఊడగొట్టాలా అని ఆలోచిస్తున్నారని ఎద్దేవా చేశారు. వానాకాలంలో రైతు భరోసా ఇవ్వకుండా ఎగ్గొట్టడం రైతులను మోసం చేయడం కాద అని ప్రశ్నించారు. వర్షాకాలానికి రైతు భరోసా పోయినట్టేనని స్వయంగా వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేసిన ప్రకటనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే రైతుల ఖాతాల్లో రైతు భరోసా జమ చేయాలని చింతా ప్రభాకర్ డిమాండ్ చేశారు. రైతులకు బీఆర్‌ఎస్ అండగా నిలిచి రైతు భరోసా ఇచ్చే వరకు మీ ప్రజాప్రతినిధులను ఎక్కడికక్కడ ముట్టడిస్తామని ఎమ్మెల్యే హెచ్చరించారు.

అదనపు ఆదాయాలను అభివృద్ధి చేసుకోవాలి




లబ్ధిదారులకు చెరుకు కోత యంత్రాలను అందజేస్తున్న ఏపీజీవీబీ ఛైర్మన్ ప్రతాప్‌రెడ్డి తదితరులు

జహీరాబాద్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ప్రతిఒక్కరూ ఉన్న వ్యాపారాలకు తోడుగా అదనపు ఆదాయాలను అభివృద్ధి చేసుకునేందుకు కృషి చేయాలని ఏపీజీవీబీ ఛైర్మన్ ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని పీవీఆర్ ఫంక్షన్‌హాల్‌లో నలుగురు రైతులకు రూ. 5కోట్లపై చిలుకు విలువ చేసే చెరుకు కోత యంత్రాలను, 10మహిళాసంఘాల సభ్యులకు రూ.10కోట్లు విలువ చేసే చెక్కులను అందజేశారు. ఈసందర్భంగ ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ వ్యాపారంగాల అభివృద్ధికి బ్యాంకులు తోడ్పాటు నందిస్తున్నాయన్నారు. బ్యాంకులు అందిస్తున్న సౌకర్యా లను ఖాతాదారులు, ప్రజలు, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వాణిజ్య బ్యాంకులకు దీటుగ ఏపీజీవీబీ (ఆంధ్రప్రదేశ్ గ్రామీణవికాస్) బ్యాంకులు సేవలవదిస్తున్నాయని చెప్పారు. అనంతరం ఉమ్మడి మెదక్‌జిల్లా ఆర్ఎం సమత మాట్లాడుతూ అందరూ పొదుపు పాటించాలని చెప్పారు. కార్యక్రమంలో ఆయా బ్యాంకుల మేనేజర్లు విక్రాంత్‌రెడ్డి, హరీశ్, గంగాజమున గోదావరి చక్కెర కర్మాగం అధికారి రవీందర్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

రైతులకు షరతులు లేని రుణమాఫీ చేయాలి

● రైతు కమిషన్‌ను కలిసిన జిల్లా నాయకులు



రైతు కమిషన్ అధ్యక్షుడు కోదండరెడ్డితో రైతు రక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి

సంగారెడ్డి రూరల్/సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : రైతు కమిషన్ ఛైర్మన్ కోదండ రెడ్డి ఆహ్వానం మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న రైతు సంఘాల ప్రతినిధులు శనివారం హైదరాబాద్‌లోని రైతు కమిషన్ కార్యాలయంలో సమావేశమయ్యారు. సమావేశంలో షరతులు లేని రుణమాఫీ చేయాలని, బ్యాంకు సిబ్బంది గ్రామాల్లోకి వెళ్లి బ్యాంకు అప్పు రెన్యూవల్ ప్రక్రియ చేపట్టాలని రైతుల సంఘాల నాయకులు కోరారు. అదే విధంగా వెంటనే రైతు భరోసా ఇచ్చి రైతులు పండించిన పంటలకు క్వింటాలుకు రూ. 500 మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్, రైతు రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు పాకాల శ్రీహరిరావు, జిల్లా అధ్యక్షుడు కాసాల రాఘవేంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతు కమిషన్‌చైర్మన్‌ను అభినందించిన ఎంపీ

నారాయణఖేడ్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని బీఆర్‌కే భవన్‌లో రాష్ట్ర రైతుకమిషన్ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన కోదండరెడ్డిని శనివారం టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, ప్రభుత్వసలహాదారు షబ్బీర్ అలీలతో కలిసి వెళ్లిన జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. వ్యవసాయ రంగఅభివృద్ధి, రైతుల సంక్షేమానికి కృషి చేయాలని కోరారు.

మత్తు.. కొత్త ఎత్తు!!

(5వ పేజీ తరువాయి)

అమాయకులు తమ జీవితాలను చిత్తు చేసుకుంటున్నారు.

హష్ ఆయిల్ కలకలం

గుంటూరు జిల్లా సత్తెనపల్లి మండలం భట్లూరు గ్రామానికి చెందిన దాసు సాయి శివ(26) ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ పటాన్‌చెరు మండలం ముత్తంగి కిర్బి కాలనీలో నివాసముంటున్నాడు. మెదక్ జిల్లా పెద్దశంకరంపేట మండల కేంద్రానికి చెందిన కోయిలకండ్ల అఖిలేష్ (26) ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ అమీన్‌పూర్ పట్టణంలోని లక్ష్మీసాయి మేడోస్‌లో నివసముంటున్నాడు. నెల్లూరు జిల్లా గూడూరు మండలం సైదాపురం గ్రామానికి చెందిన మంద్రుగట్టి ప్రేమ్ (27) ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ అమీన్‌పూర్‌లోని దుర్గా ప్రావిన్స్ కాలనీలో నివాసముంటున్నాడు. వీరంతా మూడు పదుల సంఖ్య కూడా దాటని వయస్సు చదువుకునే రోజుల నుంచి గంజాయికి బానిసయ్యారు. ప్రస్తుతం ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నారు. సంగారెడ్డి పట్టణానికి చెందిన బిలాల్, లింగంపల్లికి చెందిన శంకర్‌ల వద్ద హష్ ఆయిల్ కొనుగోలు చేసేవారు. జల్సాలు, సరదాలకు ఉద్యోగం ద్వారా వచ్చే జీతం సరిపోకపోవడంతో తాము కూడా వీటిని విక్రయించి ఎక్కువ డబ్బులు సంపాదించాలని నిర్ణయించుకున్నారు. ఇంకేముంది రంగంలోకి దిగారు. ప్రస్తుతం తాము కొనుగోలు చేసే వ్యక్తుల ద్వారా గంజాయి లిక్విడ్ ఎక్కడి నుంచి తెస్తున్నారో తెలుసుకొని అరకుకు వెళ్లారు. అరకులోని సుబ్బారావు వద్ద హష్ ఆయిల్‌ను కొనుగోలు చేసేవారు. హష్ ఆయిల్‌ను చిన్న చిన్న బాటిళ్లలో నింపి ఇక్కడకు తీసుకువచ్చి లింగంపల్లి, అమీన్‌పూర్, పటాన్‌చెరు ప్రాంతాల్లో విక్రయాలు సాగించారు. చివరకు పోలీసులకు చిక్కి జైలుపాలయ్యారు.

జీవితాలను నాశనం చేసుకోవద్దు

-చెన్నూరి రూపేష్, సంగారెడ్డి ఎస్పీ

డ్రగ్స్, గంజాయి, మత్తు పదార్థాలకు అలవాటు పడి విద్యార్థులు, కార్మికులు తమ జీవితాలను నాశనం చేసుకోవద్దు. ముఖ్యంగా ఎంతో ఉజ్వల భవిష్యత్ కలిగిన విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి. మత్తు పదార్థాలను జిల్లాలోకి రానివ్వకుండా సరిహద్దు ప్రాంతాల్లో కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నాం. పోలీసు జాగిలాల ద్వారా మత్తు పదార్థాల రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నాం. జిల్లాలో ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్ బృందం డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాల దృష్టి సారించి వాటి నిర్మూలనకు కృషి చేస్తుంది. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలంటూ ఇంజనీరింగ్, డిగ్రీ తదితర కాలేజీల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. జిల్లాలో ఎవరైనా గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాల రవాణా చేసినా సంగారెడ్డి జిల్లా పోలీసులకు 8712656777 నంబర్‌కు సమాచారం ఇవ్వాలి. సమాచారమిచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతాం.

మూఢనమ్మకాలతో దాడులకు పాల్పడవద్దు

నిజాంపేట, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మంత్రాలు, మూఢ నమ్మకాలను నమ్మి ప్రజలు ఎవరూ దాడులకు పాల్పడవద్దని ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి, సైకాలజిస్ట్ నరేష్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని శ్రీ శంకర హైస్కూల్‌లో శనివారం విద్యార్థులకు విజ్ఞాన చైతన్య సదస్సు ఆధ్వర్యంలో ఎస్ఎస్‌పీ జాతీయ కమిటీ సభ్యుడు ఉప్పులేటి నరేష్ అవగాహన కల్పించారు. మంత్రాలు, చేతబడులు కల్పితాలు మాత్రమేనని, ప్రదర్శన రూపంలో విద్యార్థుల ముందు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనారోగ్యానికి గురైతే ఆస్పత్రికి వెళ్లాలి కానీ స్వాముల వద్దకు కాదన్నారు. విద్యార్థి దశలోనే మూఢనమ్మకాలపై, మత్తు పదార్థాలపై అవగాహన కలిగి ఉండాలనే ఉద్దేశంతో పాఠశాలలో కార్యక్రమం నిర్వహించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ జైపాల్ రెడ్డి, సునీత, పాఠశాల ప్రిన్సిపాల్ అజిత్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత

● తొగుట పీఠాధిపతి మాధవానంద సరస్వతీ స్వామి



కొప్పోల్ ఉమా సంగమేశ్వర స్వామిఆలయంలో భక్తులతో మాట్లాడుతున్న మాధవానంద సరస్వతీస్వామి

పెద్దశంకరంపేట, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని తొగుట ఆశ్రమపీఠాధిపతి మాధవానంద సరస్వతీస్వామి అన్నారు. శనివారం మండలపరిధిలోని కొప్పోల్ ఉమా సంగమేశ్వర ఆలయంలో మాధవానంద సరస్వతీస్వామి ఆధ్వర్యంలో మహారుద్రాభిషేకం, స్వామివారికి లక్ష పుష్పార్చన, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, జీఎంఆర్ ఫౌండేషన్ ఛైర్మన్‌గుర్రపు మశ్చందర్, మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్,మాజీవైస్ ఎంపీపీ లక్ష్మీరమేష్, దత్తు, శంకరయ్య, ఆలయకమిటీ బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మృత్యుంజయ యజ్ఞం

ఝరాసంగం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): దేశం, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, విశ్వశాంతి ధర్మరక్షణకోసం మృత్యుంజయ మంత్ర సహస్రయజ్ఞం ప్రతి నెలా నిర్వహిస్తున్నట్లు బర్దీపూర్ ఆశ్రమ పీఠాధిపతులు అవధూతగిరి, సిదేశ్వరానందగిరి మహరాజ్ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని బర్దీపూర్ గ్రామంలో గల దత్తగిరి ఆశ్రమంలో మహామృత్యుంజయ యజ్ఞాన్ని శాస్త్రోక్తంగ ప్రారంభించారు. అందులో భాగంగా ఉదయం గురుపూజ, గణపతిపూజ, పుణ్యాహవచనం, రుత్విక్ వరుణం, మంటపారాధన, ఆవాహిత దేవతాపూజ, పూరాణ హుతి, మంగళహారతి కార్యక్రమాలను నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో జిల్లా అదనపు ఎస్పీ సంజీవరావు, జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, కొండాపూర్ సంగ్రామమహరాజ్, వీరేశ్వర శివాచార్య, విశ్వానందగిరి మహరాజ్, విశ్వమాను ధర్మప్రచారసంఘం సభ్యులు, ఎస్ఐ.నరేష్, భక్తులు పాల్గొన్నారు.

నర్సాపూర్‌లో వివాహిత అదృశ్యం



చాకలి లలిత

నర్సాపూర్,అక్టోబరు 19: నర్సాపూర్ పట్టణానికి చెందిన ఓ వివాహిత అదృశ్యమైంది. ఎస్ఐ లింగం తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని దోబీగల్లికి చెందిన వివాహిత చాకలిలలిత కుమారుడు వీరేష్ అతడి భార్య లలితతో కలిసి ఈ నెల 16వ తేదీన ఉదయం బయటకు వెళ్లి సాయంత్రం ఇంటికి చేరుకున్నారు. వారు వచ్చేసరికి ఇంట్లో వీరేష్ తల్లి లలిత లేకపోవడంతో బంధువులు, పరిసర ప్రాంతాల్లో వెతికినా ఫలితం లేకపోయింది. దీంతో బాధిత కుటుంబీకులు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పీఏసీఎస్ కార్యాలయంలో కంప్యూటర్ చోరీ

కోహీర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాచిరెడ్డిపల్లి గ్రామంలో గల పీఏసీఎస్ కార్యాలయంలో గుర్తుతెలియని దుండగులు కంప్యూటర్‌ను చోరీ చేశారు. శుక్రవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు పీఏసీఎస్ కార్యాలయం తాళాలు పగులగొట్టి కార్యాలయంలో ఉన్న సీపీయూ, మానిటర్, ప్రింటర్‌ను దొంగిలించారు. చోరీ సొత్తు విలువ సుమారు రూ.లక్ష వరకు ఉంటుందని సొసైటీ కార్యదర్శి శ్రీకాంత్ తెలిపారు. కంప్యూటర్ చోరీకి పాల్పడిన దృశ్యాలు సమీపంలోని ఓ సీసీ కెమెరాలో లభించినప్పటికీ దుండగుడి ముఖం స్పష్టంగా కనిపించలేదని పేర్కొన్నారు. కోహీర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు కార్యదర్శి శ్రీకాంత్ తెలిపారు.

ఆరుగురు జూదరులపై కేసు

కల్హేర్, అక్టోబరు 19; సిర్గాపూర్ మండల పరిధిలోని అంతర్గామ గ్రామ శివారులోని ఈగల్ కుచ్చ వద్ద శుక్రవారం రాత్రి జూదం ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్టు సిర్గాపూర్ ఎస్ ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు. నిందితుల నుంచి రూ.5180 స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ శనివారం వివరాలను వెల్లడించారు. దాడిలో ఏఎస్ఐ రవీందర్‌గౌడ్, సిబ్బంది ప్రవీణ్, సర్దార్ పాల్గొన్నట్టు ఆయన తెలిపారు.

ఘర్షణలో ఇరు వర్గాలపై కేసు నమోదు

శివ్వంపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పాడి గేదెలు పొడుచుకొని గాయపరచుకోగా ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘటన శనివారం దొంతి గ్రామాల్లో చోటు చేసుకోగా పోలీసులు కేసు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 6 న గ్రామానికి చెందిన కోదాసు పూలమ్మ తమ ఇంటి ముందు బర్రెను కట్టేయగా అక్కడే ఉన్న భిక్షపతి బర్రె పూలమ్మ బర్రెను పొడవడంతో బర్రె కన్ను పోయింది. దీంతో భిక్షపతి నష్టపరిహారం చెల్లించాలని గ్రామంలో మాట్లాడారు. అయితే ఈ వివాదంలో మల్లవరం వెంకట్‌రెడ్డి జోక్యం చేసుకొని బర్రెకు నష్టపరిహారం ఇవ్వకుండా చేశారని పూలమ్మ కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో వెంకట్ రెడ్డి శనివారం పొలం వద్దకు వెళ్లి బైకుపై వస్తుండగా మార్గమధ్యంలో గ్రామపంచాయతీ వద్ద బైకు ఆపి రూ.10వేలు నష్టపరిహారం ఇవ్వాలంటూ అడగడంతో వివాదం తీవ్రమైంది. వెంకట్‌రెడ్డి తనను కులం పేరుతో తిట్టాడని పూలమ్మ కుటుంబీకులు ఆరోపించగా, తనను ఆపి దాడికి పాల్పడ్డారని వెంకటరెడ్డి ఫిర్యాదు చేశాడు. ఇరువర్గాలవారు పరస్పర ఫిర్యాదుల మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహిపాల్ రెడ్డి తెలిపారు.

లక్ష్యాలను ఎంచుకుని ముందుకు వెళ్లాలి



విద్యార్థులతో జోగిపేట మున్సిఫ్ కోర్టు న్యాయాధికారి ధనలక్ష్మి

పుల్‌కల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): లక్ష్యాలను ఎంచుకుని ముందుకు వెళ్లాలని, చట్టాలపై విద్యార్థులకు అవగాహన అవసరమని జోగిపేట మున్సిఫ్ కోర్టు న్యాయాధికారి ధనలక్ష్మి అన్నారు. మండల కేంద్రం చౌటకూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం లీగల్ అవేర్నెస్ క్యాంప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు పలు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంఈవో జికృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు మోహన్‌రెడ్డి, మల్లేశం, రాజు, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడిగా ప్రభాకర్ రెడ్డి



ప్రభాకర్ రెడ్డిని సన్మానిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

గుమ్మడిదల, అక్టోబరు 19 : బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడిగా కొత్తపల్లి ప్రభాకర్ రెడ్డి ఎన్నికయ్యారు. కొన్ని నెలల క్రితం బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోవడంతో ఆయనతో పాటు బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎండీ హాస్సేన్ కూడా కాంగ్రెస్ పార్టీలో చేరడంతో ఆ పదవి ఖాళీ అయ్యింది. శనివారం మండలంలోని గోవర్ధన్ రెడ్డి క్యాంప్ కార్యాలయంలో రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి అధ్యక్షతన గుమ్మడిదల మండల పార్టీ అధ్యక్షుడి ఎన్నిక నిర్వహించారు. కార్యకర్తల ఏకగ్రీవ అభిప్రాయం మేరకు కొత్తపల్లి గ్రామానికి చెందిన కొత్తపల్లి ప్రభాకర్ రెడ్డిని గుమ్మడిదల మండలం నూతన బీఆర్‌ఎస్ అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా అన్నారం గ్రామానికి చెందిన నరహరి, ఉపాధ్యక్షుడిగా మల్లేష్‌గౌడ్‌ను ఎన్నుకున్నారు. గతంలో ఎన్నుకున్న కమిటీ సభ్యులు కొనసాగుతారని ఈ సందర్భంగా తెలిపారు. అలేటి శ్రీనివాస్ రెడ్డి, కొత్తపల్లి సంతోష్ రెడ్డి, సురభి వినోద్ గౌడ్, సూర్యనారాయణ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మాదిగలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

సంగారెడ్డి రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : మాదిగలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని మాదిగ ఇంటిగ్రేటెడ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎంఐసీసీఐ) ప్రెసిడెంట్ సుంచు రాజ్‌కుమార్ పేర్కొన్నారు. సంగారెడ్డిలో శనివారం నిర్వహించిన జిల్లాస్థాయి పారిశ్రామిక అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. దళిత గిరిజనులు పరిశ్రమలు స్థాపించేందుకు జిల్లా పరిశ్రమల కేంద్రం సహాయం తీసుకోవాలని సూచించారు. ఎస్సీ కార్పొరేషన్ ఏడీ రామాచారి మాట్లాడుతూ కార్పొరేషన్ రుణం తీసుకునేందుకు తమను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో హైదరాబాద్ యూసుఫ్‌గూడకు చెందిన నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎంఎస్ఎంఈ ప్రతినిధి కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి నరసింహ, కోశాధికారి సత్యేంద్ర కుమార్, ఉపాధ్యక్షుడు సుధాకర్, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థల చేయూత అభినందనీయం

నారాయణఖేడ్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వబడులలోచదువుకునే విద్యార్థులకు కంప్యూటర్‌పరిజ్ఞానాన్నిఅందించడానికి స్వచ్ఛంద సంస్థలు ముందుకురావడం అభినందనీయమని ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. శనివారం ఖేడ్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బ్రైట్ చైల్డ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన కంప్యూటర్లను ప్రారంభించిన సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకుడు క్రిష్ణపాడ్‌శెట్టి, ఫౌండేషన్ ట్రస్టీలు మాధవి, ఫణికుమార్, అడ్వైజర్ మిరియాన్ పాలి, వ్యాపారవేత్త అమూల్యరెడ్డి, సంస్థ మేనేజర్‌లు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఫౌండేషన్ కోర్సు తరగతులు

● సంగారెడ్డి మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.సుధామాధురి



సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఫస్టియర్ ఎంబీబీఎస్ విద్యార్థులకు ఈ నెల 21 వ తేదీ నుంచి 29 వ తేదీ వరకు ఫౌండేషన్ కోర్సు తరగతులు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డా.సుధామాధురి తెలిపారు. వైద్య విద్య ఏవిధంగా ఉంటుందనే దానిపై ఆన్‌లైన్‌లో తరగతులు ఉంటాయని పేర్కొన్నారు. కళాశాలలో 150 సీట్లకుగాను ఇప్పటి వరకు 149 మంది మెడికోలు అడ్మిషన్లు పొందారని తెలిపారు. తదుపరి విడతలో జరిగే కౌన్సెలింగ్‌లో 150 సీట్లు భర్తీ అవుతాయని ఆశిస్తున్నామన్నారు. ఫౌండేషన్ కోర్సు తరగతులను ఎంబీబీఎస్ ఫస్టియర్ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.